యథేచ్ఛగా అక్రమ వెంచర్లు

- కార్పొరేషన్‌గా మారడంతో అనుమతి లేకుండా లేఔట్లు
- చర్యలు తీసుకుంటున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌గా మారడం, శివారు ప్రాంతాల్లో వెంచర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వెంచర్లుగా మార్చి, హద్దురాళ్లను పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. మంచిర్యాల, నస్పూర్‌తోపాటు, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలు కలిపి మంచిర్యాల కార్పొరేషన్‌గా మారింది. మంచిర్యాలలో వెంచర్ల ఏర్పాటుకు స్థలాలు లేకపోవడంతో, నస్పూర్, విలీన 8 గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో అనుమతులు తీసుకోకుండానే వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎకరం నుంచి పదెకరాల వరకు స్థలాల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో తక్కువ ధరలకే ప్లాట్ల అమ్మకాలు అంటూ ప్రచారం సాగించి, అనుమతి లేని లేఔట్లలో ప్లాట్లను ప్రజలకు అంటగడుతున్నారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లగా, శుక్రవారం నర్సింగాపూర్‌లోని సర్వే నంబర్ 251, 252లో 2.50 ఎకరాల స్థలంలో అక్రమ వెంచర్‌లోని హద్దురాళ్లను టీపీఎస్ శ్యాం ఆధ్వర్యంలో తొలగించారు. ఆ స్థలంలో అక్రమ వెంచర్ అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనుమతులు తీసుకోని లేఔట్లలోని ప్లాట్లు కొనుగోలు చేయవద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.



నర్సింగాపూర్‌లో అక్రమ వెంచర్‌లోని హద్దురాళ్లు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఆగని భూకబ్జాలు

- ఇన్‌కామ్ టాక్స్ కార్యాలయానికి కేటాయించిన స్థలం కబ్జాకు యత్నం
- ఐడీఓసీకి కూత వేటు దూరంలో
- పట్టించుకోని అధికారులు

నస్పూర్: కాదేది కబ్జాకు అనర్హం అన్నచందంగా ఉంది నస్పూర్‌లోని ప్రభుత్వ భూముల కబ్జాల వ్యవహారం. నస్పూర్‌లో ఐడీఓసీ భవనం నిర్మించడంతో ఇక్కడ భూములకు ఒక్కసారిగా భారిగా డిమాండ్ పెరిగింది. దీంతో ఇక్కడి భూములపై కబ్జాదారుల కన్ను పడింది. ఐడీఓసీ భవన సమీపంలో నస్పూర్ శివారు సర్వే 42లో 30 గుంటల స్థలాన్ని ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయ భవనం, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలకు 2023లో అధికారులు కేటాయించారు. అదే సర్వేనంబర్‌లో తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణానికి 10 గుంటలు, గ్రంథాలయ భవన నిర్మాణానికి 6 గుంటల స్థలాన్ని కేటాయించారు. కాగా కొందరు కబ్జాదారులు రెండవ శనివారం, ఆదివారం రెండు సెలవు దినాలను ఆసరాగా చేసుకుని శుక్రవారం ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని బ్లేడు ట్రాక్టర్లతో చదును చేసి కబ్జాకు యత్నించడం పలు ఆరోపణలకు తావిస్తోంది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాలు కబ్జాకు గురవుతుండడం పట్ల ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. స్థలం కబ్జాకు యత్నించిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, విలువైన ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ సంతోష్‌ను సంప్రదించగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపించి వివరాలు సేకరిస్తానని తెలిపారు.



ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని చదును చేసిన దృశ్యం

క్లుప్తంగా

గురుకుల అధ్యాపకురాలికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న జ్యోతి

మంచిర్యాలఅర్బన్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల రాజనీతి శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మద్దెల జ్యోతి పరిశోధనలకుగాను ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. దళిత మూమెంట్ ఇన్ తెలంగాణ అన్ ఇంపాక్ట్ స్టడీ అన్ ఎర్ స్ట్ వైల్ కరీంనగర్ డిస్ట్రిక్ అనే అంశంపై రాజనీతిశాస్త్ర విభాగ సహ అచార్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ చల్లమల్ల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చేసిన విశిష్ట పరిశోధనకుగాను హైదరాబాద్‌లో డాక్టరేట్ అందజేశారు. పరిశోధన సమయంలో పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన పత్రాలు ప్రచురించారు. డాక్టరేట్ పట్టా అందుకున్న ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ అనూష అభినందించారు.

ఎంపీడీవోగా అబ్దుల్ హై



అబ్దుల్ హై

నెన్నెల: నెన్నెల ఎంపీడీవోగా మహ్మద్ అబ్దుల్ హై శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం నుంచి ఆయన బదిలీపై నెన్నెలకు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన దేవేందర్‌రెడ్డి నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోకు సిబ్బంది, కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బాధ్యతల స్వీకరణ



దేవయ్య, సీఐ

తాండూర్: తాండూర్ సీఐగా ఎన్.దేవయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐగా పనిచేసిన దేవయ్య తాండూర్‌కు బదిలీపై రాగా తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్యలు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ దేవయ్య విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వసతులు కల్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ముఖేష్

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందిచడానికి చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జే.ముఖేష్ అన్నారు. బెల్లంపల్లిలోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల (టీఎస్ఆర్ఎస్,జేసీ)ను శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, డార్మెటరీని పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్లు లేక పడుతున్న ఇబ్బందులను జడ్జి దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని ఎంఈవోను ఆదేశించారు. న్యాయవాదులు గోపికిషన్ సింగ్, చేను రవికుమార్, సంగీత ఉన్నారు.

కార్మిక సంఘాలకు గుర్తుల కేటాయింపు

కాసిపేట: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కార్మిక సంఘాలకు గుర్తులు కేటాయించారు.డీసీఎల్ ఆదేశాలతో ఐదు కార్మిక సంఘాల నాయకులు కార్మికులతో క లిసి సమావేశానికి హాజరుకాగా ఈనెల 18 న మరో సమావేశం నిర్వహించి ఎన్నికల తేదీ, షెడ్యూల్ ప్రకటిస్తామని కార్మికశాఖ అధికారులు ప్రకటించారు. గుర్తులు కేటాయించి నా ఎన్నికలతేదీకి సంబంధించి మరోవారం గడువుఇవ్వడంతో కార్మికుల్లో ఉత్కంఠ నెలకొంది.

నిబంధనలు పాటించాలి

మంచిర్యాలక్రైం: బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్ అన్నారు. రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బార్ల ముందు ఇష్టారీతిన వాహనాలు పార్కింగ్‌తో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఐ ప్రమోద్ రావు, ఎస్సైలు కిరణ్ కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సింగరేణిలో అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలి

మంచిర్యాలటౌన్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని నస్పూరు సింగరేణి స్థలాల్లో శాశ్వత నివాసం ఉంటున్న అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్‌లో వేల మంది పేద కుటుంబాలు ఎన్నోఏళ్లుగా సింగరేణి స్థలాల్లో శాశ్వత నివాసం ఉంటూ మున్సిపాలిటీకి పన్ను కడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వారికి శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. గతంలో అర్హులైన కొన్ని కుటుంబాలకు మాత్రమే పట్టాలిచ్చిందన్నారు. నస్పూర్‌లోని ఆర్కె 6, కొత్త రోడ్, కృష్ణకాలనీలో సింగరేణి స్థలాల్లో శాశ్వత నివాసం ఉంటున్న పేదప్రజలందరికి పక్కా ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్ పాల్గొన్నారు.



సీఎండీ బలరాం నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నాయకుడు రఘునాథ్

ఐఎన్టీయూసీ పిట్ సెక్రటరీగా సత్యనారాయణ

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ యూనియన్ ఆర్కే 7 గని పిట్ సెక్రటరీగా రౌతు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో నియమించిన జనక్‌ప్రసాద్‌తోపాటు బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావుకు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



సత్యనారాయణ



రాంనగర్‌బస్తీలో పిచ్చిమొక్కలు తొలగిస్తూ..



ఉగ్గెవాడలో పిచ్చిమొక్కలు తొలగింపు తర్వాత

పిచ్చిమొక్కలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి/దండేపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ రాంనగర్‌బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండడం, దండేపల్లి మండలం గూడెం గ్రామ ఉగ్గెవాడలోని ఇళ్ల సమీపంలో త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. బెల్లంపల్లి ఏఈ మల్లేశం ప్రత్యేక సిబ్బందిని నియమించి రాంనగర్‌బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. అధికారులు ఉగ్గెవాడలోని ఇళ్ల సమీపంలో త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగింపజేశారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత

పాతమంచిర్యాల: జనాభా నియంత్రణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జనాభా నియంత్రణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక జనాభా వల్ల దేశ పురోగతి కుంటుపడుతుందన్నారు. అనంతరం ఆస్పత్రిలోని గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కు.ని శస్త్రచికిత్సలు చేసుకున్న మహిళలకు నగదు పారితోషికాన్ని అందించారు. జనాభా నియంత్ర అవగాహన కరపత్రాలు ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్ పర్సన్ మధుసూదన్‌రెడ్డి, మహిళావిభాగం చైర్‌పర్సన్ జ్యోత్స్న చంద్రదత్, మంగారెడ్డి, ఆర్ఎంవోలు భీ ష్మ, శ్రీధర్, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి శివప్రసాద్, రీజినల్ చైర్మన్ సురేందర్, జోనల్ చైర్మెన్ బాలాజీ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది

మందమర్రిరూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పాత బస్టాండ్ పీహెచ్‌సీ నుంచి పాత బస్టాండ్ వరకు వైద్య సిబ్బందితో కలిసి వైద్యాధికారి రమేశ్ శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించారు. వైద్యులు కృపాబాబు, అనిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, నాందేవ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం

దండేపల్లి: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చా మోహన్‌రావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొండు జనార్దన్ అన్నారు. మండలంలోని వెల్గనూర్, గూడెం, ద్వారక, గుడిరేవు జెడ్పీహెచ్ఎస్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధించడంతోనే అర్హులైన ఎస్ఏలు, ఎంఈవో, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్, డీఈవో తదితర పోస్టులను పదోన్నతి ద్వారా పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ను వర్తింపజేయాలన్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబరాలపై కళాజాత

నెన్నెల: నెన్నెల, కన్నెపల్లి మండల కేంద్రాల్లో శుక్రవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందం, ఏపీఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజలకు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు లావుడియా రమేశ్, రవీందర్, కిష్టయ్య, శ్రావణ్, శిరీష, నాగలక్ష్మి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 282 రద్దు చేయాలి

మందమర్రిరూరల్: మున్సిపల్ కార్మికులను ఇబ్బందికి గురిచేసే జీవో 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ ఏరియాలో కార్మికులతో కలిసి శుక్రవారం జీవో పత్రాలను దగ్ధం చేశారు. మున్సిపల్ కార్మికులు ఉన్నారు.

నీటి సంరక్షణ పనులు చేపట్టాలి

వేమనపల్లి: ఉపాధిహామీ పనుల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టి భూగర్భ జల వనరులు పెంచాలని కేంద్ర జలశక్తి శాఖ భూగర్భజల శాస్త్రవేత్త రాంబాబు అన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో ఎంపీడీవో కుమారస్వామి, ఎంపీవో శ్రీనివాసులతో కలిసి జలశక్తి అభియాన్ బృందం శుక్రవారం ఉపాధి పనులను పరిశీలించారు. ఇంకుడుగుంతలు, ఊట చెరువులు, కమ్యూనిటీ సోఫిట్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ నోడల్ అధికారి సదానందం, ప్లానిటేషన్ మేనేజర్ శ్రీనివాస్, డీఆర్‌పీ రాజ్‌కుమార్, ఏపీవో మధుకర్, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



నీటి కుంట పనులను పరిశీలిస్తున్న అధికారులు

బుద్ధుడితో నా ప్రయాణం నాటిక

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి అభ్యుదయ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన బుద్ధుడితో నా ప్రయాణం నాటిక మానవత్వాన్ని మేలుకొల్పింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బుద్ధుడి ఆశయాలు నెరవేరుస్తూ ఆయన అడుగుజాడల్లో ఆయనతో కలిసి నడిచినట్లుగా కళ్లకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు. కులం మతం పేరుతో నాడు జరిగిన అరాచకాలపై ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. నాటిక నిర్వహణ కమిటీ సభ్యులు సుధాకర్, రవికుమార్, వెంకటరమణ, రాజేశం, దశరథ్, దేవిసత్యం, అశోక్ తేద, సిద్ధార్థ, రామ్మూర్తి, రాజమల్లు, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శిస్తున్న కళాకారులు

ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలి

చెన్నూర్: చెన్నూర్ గోదావరినదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులు పట్టణంలో చేపట్టిన ట్రాక్టర్లతో ర్యాలీకి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. అనంతరం వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ చెన్నూర్‌లో గోదావరి నది ఉంచుకుని పట్టణ ప్రజలు డంపింగ్ యార్డు వద్ద ఇసుకను కొనుగోలు చేయడం ఏంటని ప్రశ్నించారు. చెన్నూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మైనింగ్ శాఖ మంత్రి ఈప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గోదావరిలో రీచ్ ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గ ఆశోక్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, నాయకులు బత్తుల సమ్మయ్య, జాడి తిరుపతి, కొండపాక చారి, కాయిత రాజేశ్, కేవీఎం శ్రీనివాస్, రాజశేఖర్, మధుకర్ పాల్గొన్నారు.



బైఠాయించిన బీజేపీ నాయకులు

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

కాసిపేట: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ పేర్కొన్నారు. కాసిపేట మోడల్‌స్కూల్‌లో మండలంలోని బీఎల్వోలకు ఎన్నికలపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో నమోదు, తొలగింపుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ భోజన్న, ట్రైనర్లు సాంబమూర్తి, రమేశ్, సూపర్‌వైజర్ వజ్రపాల్‌రెడ్డి, ఆర్ఐలు రాజలింగు, కమల పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి బహుమతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. 2024–25 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ కాయకల్ప అవార్డుతోపాటు రూ.15 లక్షల నగదు బహుమతిని శుక్రవారం ప్రకటించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల నిర్వహణ తీరును అంచనా వేశారని పేర్కొన్నారు.

విద్యాసంస్థల బస్సుల తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎట్టకేలకు విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల రోజులకు రవాణా శాఖ అధికారుల్లో చలనం వచ్చింది. జిల్లాకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో విద్యాసంస్థల బస్సులను శుక్రవారం తనిఖీ చేశారు. తాజాగా మంచిర్యాల, లేజ్‌రోడ్, బెల్లంపల్లి రోడ్, ఐబీ ప్రాంతాలు, సీసీసీ, నస్పూర్‌లో బస్సులు తనిఖీ చేసి ఫిట్‌నెస్, వాహనపత్రాలు పరిశీలించారు. జిల్లాలో 380 బస్సులు ఉండగా దాదాపు 50 బస్సులకు ఇంకా ఫిట్‌నెస్ పరీక్షలు జరపాల్సి ఉంది. దీంతో ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలు నియంత్రించేలా ఈ తనిఖీలు చేపట్టారు. మొత్తం 35 వాహనాలను తనిఖీ చేయగా ఒక స్కూల్ బస్సు తోపాటు విద్యార్థులను చేరవేస్తున్న 6 టాటాఏస్ వాహనాలు ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న గుర్తించి కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు జిల్లా రవాణా శాఖా అధికారి సంతోశ్‌కుమార్ తెలిపారు. ఎంవీఐలు రంజిత్, కిశోర్‌చంద్రారెడ్డి, ఏఎంవీఐ ఖాసిం పాల్గొన్నారు.

భీమినికి ఆర్టీసీ బస్సు నడిపించాలి

భీమిని: మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరుతూ మాజీ ఎంపీపీ దంపతులు పోతురాజుల రాజేశ్వరి–లక్ష్మణ్ శుక్రవారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రానికి రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు రావడం లేదని విషయమై ఆర్టీసీ ఎండీకి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం మంచిర్యాల డిపో డీఎంకి ఫోన్‌లో సమాచారం అందించి, ఎస్ఏంకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో భాగంగా ఆరుగురు వాహనదారులు పట్టుబడ్డారు. వీరికి శుక్రవారం ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం లక్సెట్టిపేట కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు.

ఓడిన జిల్లా క్రికెట్ జట్టు

మంచిర్యాలటౌన్: హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జీఎస్సార్ క్రికెట్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో మొదటి లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన ఇంపీరియల్ టీంతో రెండు రోజుల లీగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఓడిపోయింది. ఆదిలాబాద్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 74.2 ఓవర్లలో 328 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇంపీరియల్ టీం 77.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 330 పరుగులతో విజయం సాధించింది.

గోరింటాకు సంబురం

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆర్పీలు శుక్రవారం గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. కార్యాలయంలో ఆర్పీలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ పథకాలపై కళాజాత

చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలో ప్రభుత్వ పథకాలపై శుక్రవారం కళాజాత నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. గ్రామపెద్దలు, స్వయం సహాయ సహాయ సభ్యులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

గోశాలకు పశువుల తరలింపు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల, నస్పూర్ ఏరియాలో తిరుగుతున్న పశువులను శుక్రవారం చెన్నూర్‌లోని శివలింగపురం గోశాలకు తరలించినట్లు మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. యజమానులు రోడ్లపై పశువులను వదలద్దన్నారు.

లాడ్జీల్లో తనిఖీ

మంచిర్యాలక్రైం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పేలువురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు లాడ్జీల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని అదుపులో తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గుంతలకు తాత్కాలిక మరమ్మతు

వేమనపల్లి: మంగెనపల్లి, నాగారం అటవీ ప్రాంతంలో బురదమయంగా ఉన్న రోడ్డు వెంట గుంతల్లో మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మెటల్ కంకర పోసి రోడ్డుపై తాత్కాలిక మరమ్మతు చేయించారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ నాయకులు ఉన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

జైపూర్: అనుభవం లేని డ్రైవర్ రాజ్‌కుమార్ నిర్లక్ష్యంతోనే టాటాఎస్ వాహనం పల్టీకొట్టి పిల్లలు గాయపడ్డారని, దీనికి బాధ్యతగా స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి మహేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని నర్వ నుంచి శ్రీరాంపూర్ ఆర్కే–6 కాలనీలో గ్రేస్‌పబ్లిక్ స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా 24 మంది పిల్లలతో టాటా ఏసీ వాహనంతో వెళ్తుందన్నారు. డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ప్రమాదంలో గాయపడిన పిల్లలను పరామర్శించారు.

టీబీ ముక్త్ అభియాన్ శిబిరం

చెన్నూర్‌రూరల్: అస్నాదలో అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ అభియాన్ శిబిరం నిర్వహించారు. ఇందులో వైద్యులు 123 మందికి పరీక్షలు చేశారు. 40 మందికి తేమడ పరీక్షలు చేయగా, 39 మందికి ఎక్స్‌రే తీశారు. వైద్యులు కృష్ణ తేజ, వైద్యురాలు నిహారిక, సబ్ యూనిట్ అధికారి జగదీశ్ ఉన్నారు.

రిటైర్ ఉద్యోగులకు సన్మానం

తాండూర్: అంగన్‌వాడీ ఉద్యోగులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలు ఎనలేనివని జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన మాదారం–9 అంగన్‌వాడీ కేంద్రం అంగన్‌వాడీ టీచర్ అనసూర్య, కిష్టంపేట–2, కిష్టంపేట–4, బోయపల్లి, తాండూర్ ఐబీ అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు తార, లక్ష్మి, శంకరమ్మ, చిన్నక్కలను మండలంలోని కొత్తపల్లి రైతువేదికలో రౌఫ్‌ఖాన్, బెల్లంపల్లి సీడీపీఓ స్వరూపరాణి శుక్రవారం సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కర్ర రమాదేవి పాల్గొన్నారు.

సన్మానం

దండేపల్లి: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన నెల్కివెంకటాపూర్ సహకార సంఘం సీఈవో సింగతి కిషన్‌ను పాలక మండలి సభ్యులు శుక్రవారం సన్మానించి జ్ఞాపిక అందజేశారు. చైర్మన్ లింగన్న, వైస్ చైర్మన్ రవి, డైరెక్టర్లు పాల్గొన్నారు.